క్లుప్తంగా

మహా కామేశ్వర స్వామికి విశేష పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న నిర్వాహకులు, భక్తులు

మధురవాడ: మధురవాడ ఐటీ సెజ్ కొండ లిలోని లలితా త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వర స్వామి ఆలయ 4వ వార్షిక వేడుకలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి పంచామృత, సుగంధ, జలాభిషేకాలు చేశారు. ఆలయ నిర్మాణం నుంచి సహాయ సహకారాలు అందిస్తున్న ఇండ్ల వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనను వెంకటేశ్వర్లు, కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, పాండ్రంకి అప్పారావు, జేడీ నాయుడు తదితరులు ప్రారంభించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, స్వామి వారి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ కార్యవర్గ సభ్యులు ప్రతాపరాజు, సీహెచ్ నాయుడు, కేవీ అప్పారావు, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు వాకర్ల సహకారం



జెస్సీ క్రిసోలైట్‌కు సాయం అందిస్తున్న భీమిలి జమ్ము చెరువు వాకర్లు

భీమిలి: భీమిలి జమ్ము చెరువు వాకర్లు కేథరిన్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని మేడపాటి క్రిసోలైట్‌కు రూ.20వేల విలువైన బట్టలు, స్టేషనరీ, సైకిల్ తదితర వస్తువులు అందించారు. రెండేళ్ల క్రితం ఆమె తండ్రి జానీ చనిపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న బాలికకు వారు అండగా నిలిచారు. కార్యక్రమంలో న్యాయవాది ఎస్.జనార్దనరావు, లక్ష్మీనారాయణ, దత్తి ఈశ్వరరావు, కట్టమూరి కృష్ణారావు, బొండా కిరణ్, శంకర్ కుమార్, నల్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆనందపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో బోధనతో చిన్న పిల్లల్లో మానసిక పరివర్తన కలుగుతుందని ఐసీడీఎస్ కేంద్రాల సూపర్ వైజర్ జానకి అన్నారు. మండలంలోని గంభీరం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జన్ భాగిదరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో శారీరక, మానసిక అభివృద్ధిపై శిక్షణ ఉంటుందన్నారు. పిల్లలకు సరఫరా చేసే ప్రీ కిట్ల వినియోగం, కేంద్రాలు నిర్వహణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో నాయకుడు బొట్టా రామకృష్ణ, సచివాలయ మహిళా పోలీసు ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వేశ్వరాలయ వార్షికోత్సవం

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద వివేకానందశర్మ, కార్తీక్ శర్మలు ఉమా మహేశ్వరులకు కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నసమారాధన, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, పుష్పాంజలి సేవలు నిర్వహించారు.

పాడి రైతులకు ఆర్థిక భరోసా

- అందుబాటులోకి పశు బీమా పథకం
- ఆర్బీకేల ద్వారా సేవలు



తాళ్లవలస పశు వైద్యశాల



టి.నగరపాలెం రైతు భరోసా కేంద్రం

తగరపువలస: పాడిరైతులు తమ విలువైన పశువులు ప్రమాదవశాత్తూ లేదా వ్యాధులతో మరణించేటప్పుడు ఆర్థిక భరోసా కల్పించేందుకు గాను ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. కనీసం ఒకసారి ఈనిన ఆవులు, గేదెలు ఈ పథకం కిందకు వస్తాయి. ఆవుల వయసు 2 నుంచి 10 ఏళ్లు, గేదెల వయసు 3 నుంచి 12 ఏళ్లుగాను, దుక్క పశువులలో స్వదేశీ, విదేశీ, సంకరజాతి వయసు 2 నుంచి 10ఏళ్లుగా అర్హత నిర్ధారించారు. ఆరు మాసాలు దాటిన గొర్రెలు, మేకలకు కూడా బీమా పథకం వర్తిస్తుంది. బీమా చేయించే పశువుల యూనిట్ విలువ దేశవాళీ ఆవులు, గేదెలు, దుక్క పశువులను రూ.15 వేలగాను, సంకరజాతి, మేలు జాతి ఆవులు, గేదెల, పశువుల విలువ రూ.30 వేలుగా పరిగణనలోకి తీసుకుంటారు. ఒక్కో పాడిరైతు కుటుంబానికి గరిష్ఠంగా 5 పశువులకు, 50 మేకలు, గొర్రెలకు బీమా చేస్తారు.

రైతు చెల్లించాల్సిన బీమా ప్రీమియం

- మేలు జాతి, సంకరజాతి ఆవులు, గేదెలు, దుక్క పశువులు కలిగిన పాడి రైతుల్లో తెల్ల కార్డు లేని వారు పశువు విలువ రూ.30 వేలకు గాను 3.2 శాతం రూ.960 ప్రీమియం చెల్లించాలి. తెల్ల కార్డు ఉన్న వారు, ఎస్సీ, ఎస్టీ రైతులు 1.28 శాతం రూ.384 చెల్లిస్తే సరిపోతుంది.
- దేశవాళీ, నాటు జాతి పశువులు కలిగిన రైతుల్లో తెల్ల రేషన్ కార్డు లేనివారు పశువుల విలువ రూ.15 వేలకు గాను 3.20 శాతానికి రూ.480, తెల్ల రేషన్ కార్డు ఉన్న వారు, ఎస్సీ, ఎస్టీ రైతులు 1.28 శాతానికి గాను రూ.192 చెల్లించాలి.
- గొర్రెలు, మేకలకు బీమా ప్రీమియం యూనిట్ విలువల రూ.6 వేలకు గాను మొదటి ఏడాది రేషన్ కార్డు లేని వారు 1.5 శాతంలో రూ.90, రేషన్ కార్డు కలిగి ఉన్నవారు 0.6 శాతం రూ.36 చెల్లించాలి. రెండో ఏడాది 2.25, 0.9 శాతాలకు గాను రూ.135, రూ.54, మూడో ఏడాది 3.125, 1.25 శాతాలకు గాను వరుసగా రూ.187.50, రూ.75 చెల్లించాలి.

నట్టల నివారణ, దాణా, గడ్డి విత్తనాల సమాచారం

- ఈ నెల 16 నుంచి మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు అందించనున్నారు.
- కిలో సంపూర్ణ మిశ్రమ దాణా రూ.13.30 కాగా పాడి రైతులకు రాయితీపై రూ.6.50పై వంతున గరిష్ఠంగా 1800 కిలోలు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంది. పాడి రైతులు పచ్చి గడ్డి, ఎండు గడ్డి, దాణా కలిపి వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలు ఈ ఒక్క దాణా వినియోగించడం వల్ల చేకూరుతాయి. పెద్ద పశువులకు రోజుకు 10 కిలోలు, దూడలకు 3 కిలోల వరకు ఈ దాణా అందించవచ్చు.
- గడ్డి విత్తనాలకు సంబంధించి ఒక్కో రైతుకు జొన్న 5 కిలోలు, బొబ్బర్లు 3 కిలోలు రాయితీపై అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. జొన్న 5 కిలోల ప్యాకెట్ ధర రూ.460 కాగా రాయితీపై రూ.92కు, బొబ్బర్లు 3 కిలోల ప్యాకెట్ ధర రూ.295 కాగా రాయితీపై రూ.98.50లకు అందిస్తున్నారు.

ఆర్బీకేల్లో నమోదు చేసుకోండి



పశువుల బీమా, గడ్డి విత్తనాలు, సంపూర్ణ మిశ్రమ దాణా, నట్టల నివారణ మందులకు గాను రైతులు తమకు అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లోని పశు సంవర్ధకుడి ద్వారా వివరాలు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. మిగిలిన వివరాల కోసం దగ్గరలోని పశు వైద్యశాలలను సంప్రదించాలి.

– దినేష్‌కుమార్, పశు వైద్యుడు, తాళ్లవలస

ముగిసిన దుర్గాలమ్మ ఉత్సవాలు



ఉయ్యాల కంబాలకు సిద్ధం చేస్తున్న భక్తులు

మధురవాడ: కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న చంద్రంపాలెం దుర్గాలమ్మ ఊరి పండగ మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. మంగళవారం రాత్రి 12 గంటలకు అమ్మవారి అనుపు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు, సాము గరిడీలు, నేల డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఉయ్యాల కంబాల, ఉట్టి ఊపడం తదితర కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు సజావుగా నిర్వహించడానికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు, పోలీసు, జీవీఎంసీ అధికారులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం



పిల్లలతో అక్షరాభ్యాసం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆనందపురం: రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న దృష్ట్యా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు కోరాడ అప్పలస్వామి నాయుడు కోరారు. మండలంలోని వేములవలస ప్రభుత్వ పాఠశాలలో చేరిన పిల్లలతో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి అక్కడ నాలుగేళ్లు నిండగానే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు, పలకలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాషిణి, ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్త నాగరత్నం, బోద నారాయణప్పుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నము: స్థానిక ది సెడార్ పాఠశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లలు తల్లిదండ్రులు రక్తదానం చేశారు. స్కూల్ హెచ్‌ఎం స్వెట్లి నా పాల్ కూడా రక్తదానం చేసి రక్తదాన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పల్లవి, అమృత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో విద్యారంగం అభివృద్ధి



విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును పంపిణీ చేస్తున్న బోని అప్పలనాయుడు



అనంతవరంలో విద్యార్థులకు విద్యా కానుక అందిస్తున్న ఎంపీపీ రాంబాబు



విద్యార్థులకు జేవీకే కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ మంగమ్మ, వెంకటరావు

ఆనందపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో విద్యా రంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందని భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు అన్నారు. బోని, శిర్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభం రోజునే బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాంలు అందించడం వలన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, బూర్లె పైడినాయుడు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్లోబల్ పౌరులుగా ఎదగాలి

పద్మనాభం: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, గ్లోబల్ పౌరులుగా ఎదగాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆయన జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. రాంబాబు మాట్లాడుతూ అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, మన బడి నాడు–నేడు వంటి పథకాలతో పాటు పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆణిముత్యాల పేరుతో నగదు బహుమతి అందించి ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఇటువంటి సదుపాయాలను దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కల్పించలేదన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.వి.కృష్ణ కుమార్, ఉప సర్పంచ్ కె.సత్యనారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ కె.వెంకట సత్యం, వైస్ చైర్మన్ జి.సత్యవతి, పంచాయతీ వార్డు మెంబర్ బుచ్చిబాబు, విద్యా కమిటీ కో–ఆప్షన్ మెంబర్ ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జేవీకే కిట్లు పంపిణీ చేసిన టీడీపీ కార్పొరేటర్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీ సునీల్ శర్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న విద్యా దీవెన కిట్ల పంపిణీ జరిగింది. కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, ఆమె భర్త టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావుతో కలిసి, విద్యార్థులకు వీటిని అందజేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాం, పుస్తకాలు, బెల్టు, షూ, స్కూలు బ్యాగ్ తదితర వస్తువులతో కూడిన కిట్లను సద్వినియోగం చేసుకుని, ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్‌పర్సన్ నీలమ్మ, ప్రధానోపాధ్యాయిని గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్లాస్టిక్ నిషేధంపై స్పెషల్ డ్రైవ్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో ప్లాస్టిక్ నిషేధంపై గురువారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఎక్కడైనా దుకాణాలు, వాణిజ్య సముదాయాల వద్ద ప్లాస్టిక్ వినియోగం గురించి తెలిస్తే మొదటి తప్పుగా వీధి వ్యాపారులకు రూ.500, చిన్న దుకాణాలకు రూ.2 వేలు, పెద్ద దుకాణాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్‌కు రూ.10 వేల వంతున జరిమానా విధిస్తారు. రెండో సారి పట్టుబడితే రెట్టింపు జరిమానా వసూలు చేస్తారు. మూడో సారి ట్రేడ్ లైసెన్స్ పూర్తిగా రద్దు చేయనున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, జోనల్ అధికారులు పాల్గొనాలని జీవీఎంసీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వర్షంతో ఉపశమనం

పీఎం పాలెం: సూర్యతాపంతో అల్లాడి పోతున్న ప్రజలు బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతో సేదతీరారు. అయితే గాలుల కారణంగా పీఎం పాలెం పోలీస్ స్టేషన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. దీంతో రాత్రి 9 గంటల వరకు పీఎం పాలెం, పాత పీఎం పాలెం, పిలకవానిపాలెం, గాయత్రీనగర్, హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. విద్యుత్ శాఖ ఏఈ అప్పలనాయుడు పర్యవేక్షణలో సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టి, పరిస్థితి చక్కదిద్దారు.

హెల్త్ సూపర్‌వైజర్లకు ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగులను సత్కరిస్తున్న డీఎంవో మణి, నగేష్ పట్నాయక్

సీతంపేట: నగరంలోని జిల్లా మలేరియా సబ్ యూనిట్ నుంచి విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లిన ముగ్గురు హెల్త్ సూపర్‌వైజర్లకు సహోద్యోగులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) వై.మణి మాట్లాడుతూ సూపర్‌వైజర్లు కె.వెంకటరావు, ఆర్.వి.లోకనాథం, బి.ఎస్.వర్ధన్ సబ్‌యూనిట్‌లో మంచి సేవలు అందించారని, భవిష్యత్‌లో కూడా అదేవిధంగా సేవలందించాలని కోరారు. అనంతరం వారిని దుశ్శాలువాతో సత్కరించి, బహుమతులు అందజేశారు. విజయనగరం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన మరో ముగ్గురు సూపర్ వైజర్లు సత్యానందం, జి.వి.రవికుమార్, రామి నాయుడులకు సాదరంగా ఆహ్వానం పలికారు. సూపర్ వైజర్లు బి.కుమార్, రత్నం, మహందాత, రామకోటి, కుమార్, హెల్త్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులను గుర్తించి నమోదు చేయాలి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

తగరపువలస: ఆశ కార్యకర్తలు 12 వారాలు దాటిన గర్భిణులను గుర్తించి పేర్లు నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు సూచించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని భీమిలి మండలం అమనాంలో బుధవారం ఆయన పరిశీలించారు. ఎన్‌సీడీసీడీ సర్వే, ఎఫ్‌పీసీ ఇండికేటర్స్, ఆశ యాప్ వినియోగం, హౌస్ బేస్డ్ న్యూ బోర్న్ కేర్, వ్యాక్సినేషన్ తదితర కార్యక్రమాల గురించి సిబ్బందితో మాట్లాడారు. వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం గురించి ముందుగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. వ్యాక్సిన్‌ను అనవసరంగా పాడు చేసుకోవద్దన్నారు. అనంతరం మారికవలస ఈహెచ్‌ఆర్‌ను సందర్శించారు. ఆయన వెంట డీపీఎంవో డాక్టర్ రమా రెడ్డి, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు

భీమునిపట్నము: భీమిలిలోని గ్రామోద్యోగుల భవనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం నేలమట్టం చేసిన ప్రదేశంలో బుధవారం రెవెన్యు అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని భీమిలి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటప్పారావు, మండల అధ్యక్షుడు శ్యాం, వీఆర్వో కాగుపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భీమిలికి అయోధ్య రాముడి పాదుకలు



రామయ్య పాదుకలను దర్శించుకుంటున్న భక్తులు

భీమునిపట్నము: అయోధ్య రామ మందిరంలో ప్రతిష్ఠించే పాదుకలు దేశమంతా వివిధ ప్రాంతాలను సందర్శిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం భీమిలిలోని కన్యకా పరమేశ్వరి ఆలయానికి అయోధ్య రాముల వారి పాదుకలు చేరుకున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాటిని ఊరేగించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి రామచంద్రుడి పాదుకలను దర్శించుకున్నారు.

జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

- భీమిలి జోన్‌లో గోడలపై వెలుస్తున్న అనధికార స్టిక్కర్లు, పోస్టర్లు



సంతపేటలో కొత్తగా అంటించిన సెప్టిక్ క్లీన్ వాహనాల స్టిక్కర్లు

తగరపువలస: సెప్టిక్ క్లీన్ వాహనాల యజమానులు ప్రచారంలో భాగంగా పోటీపడి భీమిలి జోన్ చిట్టివలస, సంగివలస, తగరపువలసలో పలు ఇళ్ల ముందు గోడలపై స్టిక్కర్లు అతికిస్తున్నారు. ఇళ్ల యజమానులు గుర్తించి వీటిని తొలగిద్దామనుకున్నా పెయింట్ ఊడిపోతుండటంతో కొందరు అలా ఉంచేస్తున్నా.. మరి కొందరు తీసి పడేస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి ఇళ్లకు ఖరీదైన రంగులు వేస్తుంటే తమ గోడలను పాడుచేయడం ఎంతవరకు సమంజసమని స్టిక్కర్లలో నంబర్లకు ఫోన్ చేసి అడుగుతున్నా.. స్పందించడం లేదు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తగరపువలసలో పర్యటించినప్పుడు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల గోడలపై ప్రకటనలు, పోస్టర్లు, పెయింట్లు, స్టిక్కర్లు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని తొలగించి యజమానులకు జరిమానాలు విధించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి సూచనలు కూడా చేశారు. ఆమన హెచ్చరించి పది రోజులు కూడా పూర్తి కాకముందే సెప్టిక్ క్లీన్ వాహనాల యజమానులు ఇష్టం వచ్చినట్టుగా గోడలకు స్టిక్కర్లు అంటించి వెళ్లిపోతున్నారు. అంతే కాకుండా సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలను భీమిలి రోడ్డులోని చిల్లపేట చెరువు వద్ద రహదారి పక్కనే పారవేస్తున్నందున ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహన చోదకులు వాపోతున్నారు. అనధికారంగా స్టిక్కర్లు అంటిస్తున్న వారికై టౌన్ ప్లానింగ్ అధికారులు, రోడ్ల పక్కన వ్యర్థాలు పారవేస్తున్న వారిపై శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కమనీయం.. అప్పన్న కల్యాణం



స్వామిని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం స్వామికి తిరువీధి నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య విగ్రహావిష్కరణ

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన జగద్గురు ఆదిశంకరాచార్య విగ్రహావిష్కరణ బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఆది శంకరాచార్యుల విగ్రహం వద్ద విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రైనేజీలు



సంగివలస దివీస్ పార్కు వద్ద సర్వీస్ రోడ్డు పక్కన డ్రైనేజీపై శిథిలమైన సిమెంట్ పలకలు

తగరపువలస: భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస దివీస్ పార్కు వద్ద సర్వీస్ రోడ్డు పక్కన డ్రైనేజీలపై సిమెంట్ పలకలు పలుచోట్ల శిథిలం కావడంతో వాకర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ మార్గంలో వాకింగ్‌కు వచ్చేవారితోపాటు ట్రాఫిక్ కారణంగా సంగివలస నుంచి తగరపువలసకు వచ్చే పాదచారులు ఈ డ్రైనేజీపై ఉన్న సిమెంట్ పలకల మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల ఈ డ్రైనేజీలలో పూడిక తొలగింపునకు వినియోగించిన జేసీబీలు, లారీల కారణంగా పలుచోట్ల పలకలు విరిగిపోయాయి. విరిగిన చోట చూసుకోకుండా నడిచి వెళ్లేవారు ఆదమరచి ఇందులో అడుగులు వేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు పరిశీలించి ప్రత్యామ్నాయంగా పలకలు ఏర్పాటు చేయాలని, వాటి కింద పేరుకుపోయిన పూడికను తొలగించాలని వాకర్లు, పాదచారులు కోరుతున్నారు.